సిద్ధిపురి కథలు

# పరీక్ష

-ఐతా చంద్రయ్య

"వరంగల్ నుండి మీ అమ్మా నేనూ పెళ్ళి చూపులకు డైరెక్ట్‌గా వస్తాం.

నువ్వక్కడి నుండి అటే రా. అమ్మాయిని మేము ఓ పెళ్ళిలో చూశాం. చక్కని చుక్క. కడిగిన ముత్యం. ఎమ్మే చదివిందట. నీకున్నట్టే ఆమెకూ... తనకు నచ్చిన వారినే పెళ్ళాడాలనుందట. అమ్మాయి నీకు నచ్చి తీరుతుంది. నీ ఫోటో పంపించాం. ఆమెకు నువ్వు నచ్చితే అక్కడి కక్కడే తాంబూలాలు పుచ్చుకుందాం."

నాన్న ఉత్తరాన్నందుకుని సికిందరాబాదులో బస్సెక్కి సిద్ధిపేటకొచ్చాడు శ్రీకాంత్. ఎవరో తరుముకొస్తున్నట్టు పరుగెత్తుకొచ్చి కనబడిన ఆటో ఎక్కేశాడు.

"శంకర్‌నగర్ పోనీ...!"

జెట్ విమానంలా కదిలింది ఆటో.

... బస్సులో... ఆ జవరాలెవరో...! బసెక్కగానే తన పక్కన కూచుంది... చేసుకున్న పెళ్ళాంలా. బస్సుకదిలిందో లేదో జరిగి దగ్గరకొచ్చింది. తాను కిటికీ వైపు జరిగాడు. ఆమె గూడా జరిగింది. తననే చూస్తోంది.

పాలలో కుంకుమ కలిపిన దేహఛాయ. చెవులరింగుల తళుకులు చెక్కిళ్ళలో మెరుస్తున్నాయి. బంగారు తీగల్లాంటి చేతి వేళ్ళను తన భుజమ్మీ దాడిస్తూ..

"మీ పేరేమిటో!" అడిగింది- దొండపండు పెదవిని మునిపళ్ళతో పిండేస్తూ. తన నరాల్లో సంచలనం. గబుక్కున భయమేసింది. తనపేరు చెప్పేశాడు నవ్వాలని ప్రయత్నిస్తూ.

"అలాగా... నాపేరు వరూధిని, మీ పేరు ప్రవరాఖ్యుడనుకున్నాను సుమా!" గలగలా నవ్వుతూ మరింత జరిగింది.

భుజాలు రాసుకుంటున్నాయి. శ్రీశైలం జల పాతంలా తనలో ఏదో అలజడి. ఎడమచెవి రింగు తన కుడిచెంపకు చల్లగా తగిలింది. అరచెయ్యి పెదాల కానించి మరోసారి నవ్వింది.

పిల్లకాదు... పిడుగులాగుంది. ముక్కుపుల్ల మెరిసింది.

"మీరు కొంచెం జరిగితే...!" బలవంతాన నవ్వాడు. అరచేతులంతటి ఆవిడ కళ్ళు ఏనుగు చెవులంతైనై.

"హబ్బా... ఏమైందటా!" జబ్బ మీద గిల్లింది.

ఏమంటే... ఏమంటుందో... నాలుక కదల్లేదు...

ఆటో అంబేద్కర్‌నగర్ దాటింది.

.... బస్సు ప్రజ్ఞాపూర్‌లో ఆగింది. టీ తాగి వచ్చేసరికి... కిటికీకి వీపు ఆనించి సీటుమీద కాళ్ళు బార్లాజాపి ధనుస్సుల్లా కూచునుంది. జారిన పైటను పట్టించుకోవడం లేదు. గుండెలు కవ్విస్తున్నై.

ముందు సీటు యువకుడికేవో సైగలు చేస్తోంది. కవ్వింపు తనలో కలకలం రేపింది. నాలుక తడారి పోయింది. బస్సు కదిలింది.

"నేను కూచోవాలి...!" ఆ మాత్రం అనగలిగాడు. చటుక్కున తల ఎత్తింది. అదో రకంగా పెదాలా డించింది.

"కూచోవాలా... సరే...!" మూతి తిప్పింది. వెంటనే లేచి సైగలందుకున్న యువకుని పక్కన చేరింది. బస్సు పరుగందుకుంది. వాళ్ళ ముచ్చట్లూ, పకపకలూ, వికవికలూ... అబ్బో... తన కళ్ళూ చెవులూ వాళ్ళ చుట్టే తిరిగినై.

"శంకర్‌నగరొచ్చింది సార్!" చెయ్యిజాపాడు ఆటోవాలా.

అమ్మా నాన్నలు అప్పటికే వచ్చేశారు. పెళ్ళి చూపులకు ముందు... విదేశాల్లో పెళ్ళిల్లూ, దేశ రాజకీయాలూ ముచ్చట్లలో కరిగిపోయినై.

"అదో... అమ్మాయొస్తుందిరా! మాలక్ష్మిలాగుంది. పేరు పల్లవి." శ్రీకాంత్ చెవిలో ఊదింది తల్లి.

గులాబీ రంగు చీర ఆకుపచ్చ పూవుల అంచు, అదే రంగు జాకెట్టు...

ఓహ్... బ్యూటీ ఫ్లవర్! అచ్చం దేవకన్యలాగుంది. నా కలలపాటకు పల్లవి... ఈమెనే, కదిలే ఆమని... మనసు ఊయలలూగింది.

రాయంచలా నడిచొచ్చి ఫలహారాలందించింది. శ్రీకాంత్ కళ్ళలోకి చిలిపిగా చూసింది. ముసి ముసి నవ్వులతో గిలిగింతలు పెట్టింది. అమ్మాయి తనకు నచ్చిందని అమ్మా నాన్నలకు చెప్పేశాడు సైగలతో.

అలవోకగా కూచుంది పల్లవి. అందాలన్నీ కుప్పబోసినట్టుంది.

"ఇంకేమైనా పరీక్షలున్నాయా?" లోపలి నుండి వచ్చి అడిగిందో యువతి... పల్లవి పక్కన కూచుంటూ.

ఈమె... ఈమె వరూధిని... ఇక్కడెందుకుందీ? శ్రీకాంత్ నోరెళ్ళ బెట్టాడు. వెంటనే అడిగేశాడు.

"మీరా వరూధిని గారూ!"

"ఔను. నేనే శ్రీకాంత్ గారూ! వీరు నాక్కాబోయే భర్త." ఫణిభూషణ్ గారు. బస్సులో సైగచేసిన యువకుణ్ణి పరిచయం చేసింది.

"ఏమిటిదంతా?" లేవబోయాడు.

"కూచోండి శ్రీకాంత్ గారూ! మీరు నాకు బాగా నచ్చారు." పల్లవి మాట వీణమీటి నట్టుంది.

"పల్లవి, వరూధినులు అక్కా చెల్లెళ్ళ సంతాన మండి. ఫణిభూషణందుకున్నాడు." శ్రీకాంత్ బుద్ధిని పరీక్షించే బాధ్యత పల్లవి, వరూధిని కప్పగించింది. వరూధిని హైదరాబాదులోనే ఉంటుంది. బస్సులో మిమ్మల్ని పరీక్షించింది. మీకు ఫస్ట్ మార్క్ వేసింది."

అందరి మొహాలు మిట్ట మధ్యాహ్నం ప్రొద్దు తిరుగుడు పూవులా విచ్చుకున్నాయి.

"మా అమ్మాయి సాహసాన్ని మీరు మరోలా భావించొద్దు బాబూ!" పల్లవి తండ్రి శ్రీకాంత్ చేతులు పట్టి బతిమాలాడు.

"ఏదో చిన్నపిల్ల..." తల్లి ఆరాటం.

"క్షమించండి శ్రీకాంత్ గారూ!" పల్లవి చేతులు జోడించింది. "ఎంతటి ధన హీనుడినైనా భర్తగా స్వీకరించగలను గానీ గుణహీనుడిని మాత్రం భరించలేను."

"రోజులు మారాయి గదూ!" గుండెల నిండా నవ్వేశాడు శ్రీకాంత్.


-ఐతా చంద్రయ్య
ఇ.నం.4-4-11 శేర్పూర,
సిద్ధిపేట - 502 103.